
కృష్ణనగర్‌లో పూజల్లో కాంగ్రెస్‌ నేత చౌడ శ్రీనివాస్‌రావు


అయోధ్యనగర్‌లో బోనాలతో భక్తులు


జగద్గిరిగుట్ట రాజీవ్‌గృహకల్పలో బీజేపీ నేత శేఖర్‌యాదవ్‌


సాయిగూడెంలో తొట్టెలు తీస్తున్న యువకులు

# బోనమెత్తిన భక్తజనం

● అమ్మవార్లకు బోనాల సమర్పణ, మొక్కుల చెల్లింపు ● కుత్బుల్లాపూర్‌ నియోజకవర్గవ్యాప్తంగా ఉత్సవాలు ● ఉదయం నుంచే ఆలయాలకు పోటెత్తిన భక్తులు


సూరారంలో బోనంతో యువతి

కుత్బుల్లాపూర్‌ నియోజకవర్గవ్యాప్తంగా ఆదివారం బోనాల సందడి నెలకొన్నది. ఉదయం నుంచే ఆయా ప్రాంతాల్లోని అమ్మవార్ల ఆలయాలకు భక్తులు పోటెత్తారు. శివసత్తుల పూనకాలు, పోతరాజుల విన్యాసాల మధ్య మహిళలు బోనాలతో తరలివచ్చి అమ్మవార్లకు నైవేద్యంగా సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందుల్లేకుండా నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు.

–కుత్బుల్లాపూర్‌ జోన్‌ బృందం


వైష్ణవి ఎన్‌క్లేవ్‌లో శ్రీరేణుకా ఎల్లమ్మ


కుత్బుల్లాపూర్‌లో ఎమ్మెల్యే వివేకానంద్‌ను సత్కరిస్తున్న సభ్యులు


సంజయ్‌గాంధీనగర్‌లో నర్సాపూర్‌ మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, తదితరులు


ధూలపల్లిలో కల్లు ఘటం సమర్పించేందుకు వెళ్తున్న భక్తులు


నిజాంపేట్‌లో పూజల్లో కొలన్‌ గోపాల్‌రెడ్డి


బాలయ్యనగర్‌లో బోనాలతో వస్తున్న మహిళలు


సుభాష్‌నగర్‌ పోచమ్మ ఆలయంలో బీజేపీ నాయకులు


మైసమ్మనగర్‌–బీబ్లాక్‌ ఉత్సవాల్లో నర్సారెడ్డి భూపతిరెడ్డి


సుభాష్‌నగర్‌లో బోనాలతో మహిళలు


కుత్బుల్లాపూర్‌ హరిజనబస్తీలో బోనాలతో మహిళలు


మల్లంపేట్‌లో బోనాలతో తరలి వచ్చిన మహిళలు


ఎస్‌ఆర్‌ నాయక్‌నగర్‌ బోనాలతో వెళ్తున్న మహిళలు

## సర్వీస్‌ రోడ్డుపై ట్రా‘ఫికర్‌’..!

కుత్బుల్లాపూర్‌: పేట్‌బషీరాబాద్‌ అంగడిపేట నుంచి ఎన్సీఎల్‌ కాలనీ మీదుగా అల్వాల్‌ ట్రాఫిక్‌ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లే సర్వీస్‌ రోడ్డుపై ట్రా‘ఫికర్‌’ నెలకొన్నది. అసలే ఇరుకు రోడ్డు ఆపై రోడ్డు పక్కనే వాహనాలు నిలుపుతుండడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. శనివారం రాత్రి డీ మార్ట్‌ సమీపంలో సుమారు అరగంటసేపు వాహనాలు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. ఇప్పటికైనా సంబంధిత శాఖల అధికారులు స్పందించి రోడ్డు పక్కన వాహనాలు నిలుపకుండా చర్యలు తీసుకుని స్థానికంగా ఇద్దరు ట్రాఫిక్‌ కానిస్టేబుళ్లను నియమించి ట్రాఫిక్‌ సమస్య లేకుండా చూడాలని వాహనదారులు, స్థానికులు కోరుతున్నారు.


సర్వీసు రోడ్డుపై ఇష్టారాజ్యంగా నిలిపిన వాహనాలు

## అందరిదీ నేర చరిత్రే

హత్య కేసులో నిందితుల రిమాండ్‌

బంజారాహిల్స్‌: బంజారాహిల్స్‌ రోడ్డు నెంబర్‌–12లోని ఎన్‌బీటీనగర్‌ పోచమ్మగుడి చౌరస్తాలో ఈ నెల 23వ తేదీన అర్ధరాత్రి జరిగిన యువకుడిపై దారుణ హత్య కేసులో నలుగురు నిందితులను బంజారాహిల్స్‌ పోలీసులు రిమాండ్‌కు తరలించారు. మద్యానికి, గంజాయికి బానిసై జల్సాలకు అలవాటు పడి నిత్యం తాగుతూ ఒకరిని మించి మరొకరు తామే గొప్ప అనే చాటుకునే క్రమంలో జరిగిన హత్య కేసును బంజారాహిల్స్‌ పోలీసులు ఛేదించారు. సింగాడికుంటలో నివసించే ఖాజాపాషాతో పాటు బంజారాహిల్స్‌ రోడ్డునెంబర్‌–12లోని ఎన్‌బీనగర్‌లో నివసించే కె. ప్రసాద్‌ యాదవ్‌ అలియాస్‌ పర్శా, శ్రీరామ్‌నగర్‌లో నివసించే బటిపూడి వంశీ (21), గోవుల మహేష్‌ (22), పూజారి సాయి (19)లు స్నేహితులు. వివిధ కేసుల్లో వీళ్లంతా జైలుకు వెళ్లి వచ్చినవారే. ఈ నెల 23న రాత్రి వీరంతా కలిసి బంజారాహిల్స్‌ రోడ్డునెంబర్‌–13లోని వైట్‌హౌస్‌ వద్ద మద్యం సేవించారు. అంతకుముందే ప్రసాద్‌ యాదవ్‌ (పర్శా), ఖాజా ఇద్దరి మధ్య గొడవ జరిగింది. తనను మించిపోతున్నాడని, తనపై ఆధిపత్యం చెలాయించడానికి ప్రయత్నిస్తున్నాడని కోపం పెంచుకున్న పర్శా, వంశీ, మహేష్‌, సాయి రాత్రి పీకల దాకా మద్యం సేవించి ఖాజాపాషా హత్యకు కుట్ర చేసి హత్య చేశారు. అనంతరం పర్శా అక్కడి నుంచి విజయవాడకు పరారయ్యాడు. కాగా అదే రోజు ముగ్గురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పక్కా సమాచారంతో ప్రధాన నిందితుడు పర్శాను అరెస్టు చేసి నలుగురిని రిమాండ్‌కు తరలించారు. పర్శాపై మూడు కేసులు ఉండగా ఈ నెల 17న బెయిల్‌పై విడుదలయ్యాడు. ఈ మేరకు బంజారాహిల్స్‌ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## బెల్ట్‌షాపుపై పోలీసుల దాడి

కుత్బుల్లాపూర్‌: బెల్ట్‌షాపుపై పేట్‌బషీరాబాద్‌ పోలీసులు దాడులు చేసి 13.4 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. ధూలపల్లి గ్రామంలో భైరి మురళి (54) తన కిరాణం షాపులో కొంత కాలంగా మద్యం అమ్మకాలు చేపడుతున్నాడని అందిన సమాచారం పేట్‌బషీరాబాద్‌ పోలీసులు ఆదివారం దుకాణంపై దాడులు నిర్వహించగా 13.4 లీటర్ల మద్యం బాటిళ్లను పట్టుకున్నారు. నిర్వాహకుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వారు తెలిపారు.

## సమస్యల్లో సర్కారు కాలేజీ..!

● రాయదుర్గం ప్రభుత్వ జూనియర్‌ కళాశాలలో వసతులు కరువు
● పెరుగుతున్న విద్యార్థుల సంఖ్య.
● ప్రస్తుత విద్యా సంవత్సరంలో 430 మంది చేరిక
● సరిపడని తరగతి గదులు, ల్యాబ్‌లు
● విద్యార్థులు, అధ్యాపకుల అవస్థలు
● పట్టించుకోని అధికారులు

రాయదుర్గం: గచ్చిబౌలి డివిజన్‌ మధురానగర్‌లోని రాయదుర్గం ప్రభుత్వ జూనియర్‌ కళాశాల సమస్యల్లో కొట్టుమిట్టాడుతోంది. కనీస సౌకర్యాలు లేక విద్యార్థులు, అధ్యాపకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఏటా కళాశాలలో విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరుగుతున్నా.. అందుకనుగుణంగా తరగతి గదులు, ల్యాబ్‌ల సంఖ్య పెంచకపోవడంతో ఉన్న వాటితోనే సర్దుకుపోవాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ విషయమై పలుమార్లు అధికారులకు వినతిపత్రాలు అందించినా ఫలితం లేకుండా పోయిందని స్థానికులు, విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సౌకర్యాలు కల్పించాలని వారు కోరుతున్నారు.

- 2024–25 విద్యా సంవత్సరంలో 430 మంది విద్యార్థులు అడ్మిషన్‌ తీసుకున్నారు.
- గతేడాది చేరిన 450 మంది సెకండియర్‌కు ప్రమోట్‌ కాగా ప్రస్తుతం ఫస్టియర్‌, సెకండియర్‌ విద్యార్థుల సంఖ్య 880 చేరింది.
- కళాశాలలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ ఆంగ్ల, తెలుగు మీడియం, ఒకేషనల్‌ కోర్సుల్లో ఏటా విద్యార్థులు చేరుతున్నారు.
- 50 మందితో ప్రారంభమైన కాలేజీలో ప్రస్తుతం 880 మంది విద్యార్థులు ఉండడంతో విద్యా కమిటీ సంతోషం వ్యక్తం చేస్తోంది.


రాయదుర్గం ప్రభుత్వ జూనియర్‌ కళాశాల

### మరో 2 తరగతి గదులు.. 4 ల్యాబ్‌లు అవసరం..

- మధురానగర్‌లోని ప్రభుత్వ జూనియర్‌ కళాశాలలో ప్రస్తుతం 8 తరగతి గదులు ఉన్నాయి.
- ఇంకనూ అదనంగా రెండు తరగతి గదులు, నాలుగు ల్యాబ్‌ భవనాల నిర్మిస్తే విద్యార్థులకు మేలు చేకూరే అవకాశం ఉంది.
- ప్రతి కోర్సులో 100 మంది విద్యార్థులకు అవకాశం కల్పించడంతో తరగతి గదుల కొరత, వారికి కల్పించాల్సిన సౌకర్యాలు సమస్యగా మారింది.
- అంతేకాకుండా కళాశాల చుట్టూ ఉన్న ప్రహరీ ఎత్తును పెంచాల్సిన అవసరం ఉంది.
- కళాశాలలో మౌలిక వసతుల కల్పనకు చేరువలోని రాయదుర్గం విద్యా కమిటీ చొరవపై ఐటీ సంస్థలు, కొమిరిశెట్టి, స్నేహ ఫౌండేషన్‌, ఎన్‌ఆర్‌ఐ సహకారంతో పలు సౌకర్యాలు కల్పించారు.

### కళాశాలలో మౌలిక వసతులు కల్పించాలని విన్నపం..

- మధురానగర్‌లోని రాయదుర్గం ప్రభుత్వ జూనియర్‌ కళాశాలలో మౌలిక వసతులు కల్పించాలని రాయదుర్గం విద్యా కమిటీ బృందం కోరింది.
- ఈ విషయమై 2 రోజుల క్రితం శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడిగాంధీని బృందం కలిసి విన్నవించింది.
- రాయదుర్గం జూనియర్‌ కళాశాలలో పూర్తిస్థాయి మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే హామీనిచ్చారని సభ్యులు తెలిపారు.

## చికిత్స పొందుతూ గుర్తు తెలియని వ్యక్తి మృతి

గచ్చిబౌలి: ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన గచ్చిబౌలి పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ రాజశేఖర్‌ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 25న కొండాపూర్‌ శ్రీరాంగనగర్‌ కాలనీలో గుర్తు తెలియని వ్యక్తి (70) అపస్మారక స్థితిలో ఉన్నట్లు గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించింది. దీంతో పోలీసులు అతడిని కొండాపూర్‌ జిల్లా ఆస్పత్రికి తరలించారు. అతడి ఆరోగ్య పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం ఉస్మానియా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శనివారం సాయంత్రం మృతి చెందాడు. మృతుడి సంబంధికులు ఉంటే గచ్చిబౌలి పోలీస్‌ స్టేషన్‌లో సంప్రదించాలని పోలీసులు సూచించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## రేపు ‘డయల్‌ యువర్‌ డీఎం’

జీడిమెట్ల: ఈ నెల 30న ‘డయల్‌ యువర్‌ డీఎం’ కార్యక్రమం నిర్వహించనున్నట్లు జీడిమెట్ల డిపో మేనేజర్‌ ఆంజనేయులు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. మంగళవారం మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 4 గంటల వరకు కార్యక్రమం కొనసాగుతుందని, ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు ఉన్నా డీఎం నంబర్‌కు 9959226150 ఫిర్యాదు చేయవచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం ద్వారా ఆర్టీసీ ప్రజలకు మరింత చేరువు అవుతుందని డీఎం ఆశాభావం వ్యక్తం చేశారు.

## వ్యాయామంతో సంపూర్ణ ఆరోగ్యం

గచ్చిబౌలి: నిత్యం వ్యాయామం చేస్తే ఆరోగ్యానికి ఎంతో మేలు కలుగుతుందని మిస్‌ గ్లోబ్‌ ఇండియా–2023, రాయల్‌ కాలేజ్‌ ఆఫ్‌ ఫిజీషియన్‌ ఐశ్వర్య పాతపాటి అన్నారు. ఆదివారం గచ్చిబౌలిలోని కేర్‌ ఆస్పత్రిలో వరల్డ్‌ హెపటైటీస్‌ డేను పురస్కరించుకుని హెపటైటీస్‌, ఫిట్‌నెస్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జీవన శైలిలో చిన్న మార్పులు చేసినా మంచి మార్పును చూడవచ్చన్నారు. కేర్‌ హాస్పిటల్‌ చీఫ్‌ ఆపరేటింగ్‌ ఆఫీసర్‌ సునీత అగర్వాల్‌ మాట్లాడుతూ హెపటైటీస్‌ కారణంగా ప్రపంచ వ్యాప్తంగా ఏటా వేలాది మంది మరణిస్తున్నారన్నారు. కాలేయ ఆరోగ్యాన్ని తెలుసుకోవడానికి కేర్‌ హాస్పిటల్‌ స్క్రీనింగ్‌ ప్యాకేజీని అందుబాటులోకి తీసుకువచ్చిందన్నారు. మెడికల్‌ గ్యాస్ట్రోఎంటరాలజీ హెచ్‌ఓడీ డాక్టర్‌ ఆశా సుబ్బలక్ష్మి మాట్లాడుతూ ఐదు రకాల వైరస్‌ల వల్ల హెపటైటీస్‌ సోకుతుందన్నారు. వ్యాక్సిన్‌ల ద్వారా హెపటైటీస్‌ బీ,డీ నయమవుతందని, హెపటైటీస్‌ సీ మందుల ద్వారా తగ్గుతుందని తెలిపారు. కలుషిత నీరు, ఆహారం ద్వారాహెపటైటీస్‌ సోకే అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో డాక్టర్‌ జి.స్వాతి, వివిధ కంపెనీల ఉద్యోగులు పాల్గొన్నారు.

## ప్రేమ పేరుతో మోసం

వెంగళరావునగర్‌: యువతిని ప్రేమపేరుతో మోసగించి నగదు, నగలు కాజేసిన యువకుడిపై మధురానగర్‌ పీఎస్‌లో కేసు నమోదైంది. ఖమ్మం జిల్లాకు చెందిన యువతి 2019లో బీటెక్‌ పూర్తి చేసి నగరంలో ఎస్‌బీఐ క్రెడిట్‌ కార్డు కార్యాలయంలో పనిచేసింది. పల్నాడు జిల్లా నరసరావుపేటకు చెందిన సాయిచంద్ర అతని స్నేహితుడు ప్రసాద్‌ ఓ ప్రైవేట్‌ కార్యాలయాన్ని ప్రారంభించగా సదరు యువతి 2022లో ఆ ఆఫీస్‌లో చేరింది. నెల తర్వాత సాయిచంద్ర ఆమె ప్రేమించానని చెప్పడంతో ఒప్పుకుంది. అనంతరం ఆమె నుంచి రూ. 2 లక్షల నగదు, బ్రాస్లెట్‌, చైన్‌, ఆమె క్రెడిట్‌ కార్డు మీద రూ. 8 లక్షలు తీసుకున్నాడు. తిరిగి తన డబ్బులు తనకు ఇవ్వమనగా ఇద్దరూ దిగిన ఫొటోలు బంధువులు, స్నేహితులు, సోషల్‌ మీడియాలో పెడతానని బెదిరించాడు. దీంతో మోసం చేసిన సాయిచంద్రపై మధురానగర్‌ పీఎస్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసును దర్యాప్తు చేస్తున్నారు.

## వ్యక్తి రిమాండ్‌

ఫిలింనగర్‌: వరకట్న వేధింపులకు గురిచేసి యువతి ఆత్మహత్యకు కారకుడైన నిందితుడిని ఫిలింనగర్‌ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. వివరాల్లోకి వెళ్తే.. జనగామ జిల్లాకు చెందిన పసుల రాజు (33), గొల్లూరి ప్రణీత 2020లో ప్రేమించుకుని పెళ్లి చేసుకున్నారు. వీరిద్దరూ ఫిలింనగర్‌లోని ఓ సెలూన్‌లో పనిచేస్తూ బీజేఆర్‌నగర్‌ బస్తీలో అద్దెకు ఉంటున్నారు. కొంతకాలంగా రాజు ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నాడు. ఈ క్రమంలో భార్యతో గొడవపడుతూ పుట్టింటికీ వెళ్లి అదనపు కట్నం తీసుకురావాలని వేధించాడు. దీంతో ప్రణీతకు శారీరక, మానసిక వేధింపులు ఎక్కువ కావడంతో ఈ నెల 23న భర్త రాజు బయటకు వెళ్లిన సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. భార్య ఆత్మహత్యకు కారకుడైన రాజుపై ఫిలింనగర్‌ పోలీసులు బీఎన్‌ఎస్‌ సెక్షన్‌ 80 కింద కేసు నమోదు చేసుకుని రిమాండ్‌కు తరలించారు. కేసును ఫిలింనగర్‌ సీఐ ఎం.శ్రీనివాసులు నేతృత్వంలో ఎస్‌ఐ పి.విజయ్‌కుమార్‌ దర్యాప్తు చేస్తున్నారు.

## తెలంగాణ సంస్కృతికి ప్రతీక బోనాలు

మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు


బోనాల వేడుకల్లో మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు

ముషీరాబాద్‌: ఆషాఢమాసంలో హైదరాబాద్‌లో జరిగే బోనాలు తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీక అని మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు పేర్కొన్నారు. బోనాల పండుగ సందర్భంగా తెలుగు ప్రజలందరూ సుఖ సంతోషాలతో పాడిపంటలతో విరసిల్లాలని అమ్మవారిని కోరినట్లు ఆయన తెలిపారు. హర్యానా గవర్నర్‌ బండారు దత్తాత్రేయ ఆధ్వర్యంలో రాంనగర్‌లోని తన నివాసంలో ఆదివారం నిర్వహించిన బోనాల పండగకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై పూజలు చేశారు. అనంతరం వెంకయ్యనాయుడు మాట్లాడుతూ.. బోనాల వేడుకల్లో తాను పాల్గొనడం సంతోషం కలిగించిందన్నారు. ఈ ఉత్సవాలకు దత్తాత్రేయ తనను ఆహ్వానించడం సంతోషంగా ఉందన్నారు. ఈ సందర్భంగా దత్తాత్రేయ కుమార్తె, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి బండారు విజయలక్ష్మి ఆయనను సత్కరించారు. ఈ వేడుకల్లో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, రాజ్యసభ సభ్యుడు డాక్టర్‌ కె.లక్ష్మణ్‌, బీజేపీ ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే చింతల రాంచంద్రరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ ఎన్‌.రాంచందర్‌రావు, ముషీరాబాద్‌ ఎమ్మెల్యే ముఠా గోపాల్‌, బీజేపీ కార్పొరేటర్‌ కె.రవిచారి, సుప్రీయానవీన్‌గౌడ్‌, పావని వినయ్‌, రచనశ్రీ, బీజేపీ సికింద్రాబాద్‌ సెంట్రల్‌ జిల్లా అధ్యక్షులు డాక్టర్‌ ఎన్‌.గౌతమ్‌రావు పాల్గొన్నారు.

## ఘనంగా అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ


పూజల్లో పాల్గొన్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే

బంజారాహిల్స్‌: జూబ్లీహిల్స్‌ డివిజన్‌ వినాయనగర్‌లోని ఈదమ్మ అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ వేడుకలు ఆదివారం వైభవంగా జరిగాయి. ఈ వేడుకల్లో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డితో పాటు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గత రెండు రోజులుగా జరుగుతున్న పూజా కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం ఉదయం అశ్విని నక్షత్ర యుక్త సింహలగ్న పుష్యరాంశ సుముహూర్తంలో అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపన వేడుకలను అర్చకులు, వేద పండితులు నిర్వహించారు. ఈ సందర్భంగా పూజల్లో పాల్గొన్న కేంద్రమంత్రి, ఆలయ దాత చింతల రామచంద్రారెడ్డిని బస్తీవాసులు, ఆలయ కమిటీ ప్రతినిధులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో నేతలు సంపంగి కిరణ్‌, రామకృష్ణారెడ్డి, వీరేష్‌, శ్రీశైలం, వి.రాములు, వల్లపు శంకర్‌, తదితరులు పాల్గొన్నారు.